కార్మికుల పొట్టగొడుతున్నారు..

- అనుమతులున్నా తెరుచుకోని వాడపల్లి ఇసుక ర్యాంపు
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు
- వేల మంది పడవ కార్మికుల ఉపాధికి గండి



కొవ్వూరు మండలం వాడపల్లిలో మూతపడిన ఇసుక ర్యాంపు

కొవ్వూరు: జిల్లాలోనే అతిపెద్ద పడవల ర్యాంపుగా పేరు గాంచిన వాడపల్లి ఇసుక ర్యాంపు రాజ కీయం చదరంగంలో పావులా మారింది. నిత్యం వేలాది పడవ కార్మికులకు ఉపాధి కల్పించే ఇసుక ర్యాంపు రెండు నెలల నుంచి తెరుచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. డిసెంబర్ 31వ తేదీతో ఈ ర్యాంపునకు కేటాయించిన ఇసుక నిల్వ పూర్తి కావడంతో జనవరి ఒకటో తేదీ నుంచి ర్యాంపును అధికారికంగా మూసి వేశారు. పర్యావరణ అనుమతులు రావడం కొంత జాప్యం కావడంతో కొన్నాళ్లు ర్యాంపు తెరవడానికి ఆలస్యం అయింది.

సుమారు పదిహేను రోజుల క్రితమే ఈ ర్యాంపునకు అవసరమైన అన్ని అనుమతులు వచ్చినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లు కారణంగా ఈ ర్యాంపు తెరవడం లేదు. ఈ ర్యాంపునకు 1.80 లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకానికి అనుమతులు వచ్చాయి. ర్యాంపులో సుమారు 200 పడవలున్నాయి. వీటిపై రెండు వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతుండగా పరోక్షంగా మరో వెయ్యి మందికి ఉపాధి లభిస్తోంది. ఇంతమందికి ఉపాధి చూపుతున్న ఈ ర్యాంపును తెరవడంపై అధికారులు మీనమేషాలు లెక్కించడం గమనర్హం. ఈ ర్యాంపుల్లో రెండు సొసైటీలు నడుస్తున్నాయి. ఒక సొసైటీలో తొంభై శాతానికి పైగా సభ్యులుంటే మరో సొసైటీలో తొమ్మిది మంది మాత్రమే ఉన్నారు. ఈ తొమ్మిది ఉన్న సొసైటీకి సైతం ఇసుక తవ్వకం కేటాయింపు చేయాలని ఓ మాజీ మంత్రి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సూచనల మేరకు ర్యాంపు తెరవడాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సమాచారం. వేలాది మంది ఉపాధిలో ముడిపడి ఉన్న ర్యాంపును తెరవడంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు.

జిల్లా వ్యాప్తంగా ఇటీవల పది కొత్త ర్యాంపులు తెరవడం కోసం పర్యావరణ అనుమతులు మంజూరులో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు సైతం నిర్వహించారు.వాడపల్లి ర్యాంపులో మాత్రం కూటమి నేతల ఒత్తిళ్ల కారణంగా మూసి వేయడం శోచనీయం. ఇప్పటికే మూడు నెలలు కావడంతో వేల మంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. కొందరు పడవల యజమా నులు, కూలీలు ఆర్థిక ఇబ్బందులను చవి చూస్తున్నారు. ఇటీవల ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, పడవల యజమానులు, పడవ కార్మికులు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణలు జిల్లా కలెక్టర్ ప్రశాంతిని స్వయంగా కలిసి ర్యాంపు తెరవాలని కోరారు. పడవ కార్మికులు ఉపాధి లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి నాయకులు కలెక్టర్‌కు వివరించారు. ఇసుక ర్యాంపుల్లో రాజకీయ ప్రమేయం లేకుండా నిర్వహిస్తామంటూ ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా మాటలు నీటి మూటలుగానే మిగిలాయి.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో పునఃప్రతిష్ఠించిన సీతారామ, లక్ష్మణస్వామి విగ్రహాలు



సీతారామస్వామి ఆలయంలో కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు

దేవరపల్లి: దుద్దుకూరులో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాల పునఃప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుమారు 130 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఆలయ పునఃప్రతిష్ఠాపనకు గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. దాతల సహకారంతో సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణం చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో పునప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఉదయం 10.52 గంటలకు వైఖానస ఆగమశాస్త్ర విధానం ప్రకారం సీతారామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన, కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుద్దుకూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి సీతారామస్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ హోం మంత్రి తానేటి వనిత, స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి తానేటి వనితకు ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. స్థానిక ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్ర బాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాపోలు రెడ్డిబాబు, నిమ్మగడ్డ కృష్ణారావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రు అనీల్, పార్టీ నాయకులు గన్నమని హరికృష్ణ, ముళ్లపూడి దొరాజీ చౌదరి, పలువురు నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం సమీపంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

తాళ్లపూడిలో షూటింగ్ సందడి



తాళ్లపూడిలో మైత్రీ మూవీ మేకర్స్ చిత్ర షూటింగ్‌లో పాల్గొన్న డైరెక్టర్ మహేష్ కుమార్

తాళ్లపూడి: మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న కొత్త చిత్రానికి సంబంధించి పలు సన్నివేశాల చిత్రీకరణతో తాళ్లపూడిలో షూటింగ్ సందడి నెలకొంది. తాళ్లపూడిలోని సాయి బాబా ఆలయం, శ్రీహిత ట్రేడర్స్ ఐరన్ సిమెంట్ షాపు వద్ద పలు కీలక సన్నివేశాలను హీరో రామ్ పోతినేనిపై చిత్ర దర్శకుడు మహేష్‌కుమార్ చిత్రీకరించారు. రేపో22గా ఈ చిత్రం తెరకెక్కిస్తున్నట్టు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. గత కొద్ది రోజులుగా గోదావరి పరిసర ప్రాంతాల్లో చిత్ర షూటింగ్‌లో భాగంగా పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్టు ప్రొడక్షన్ మేనేజర్ ఉమాశంకర్ తెలిపారు. ఈ చిత్రంలో రామ్‌తో పాటు హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే, నిర్మాతలుగా నవీన్‌యర్రేని, రవిశంకర్‌లు వ్యవహరిస్తున్నారు.

వేడుకకు హాజరైన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

గోపాలపురం: గోపాలపురం మండల మాజీ అధ్యక్షుడు మాజీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి కుమార్తె సుశ్రిత యశ్వంత్‌రెడ్డిల నిశ్చితార్థ వేడుక స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈవేడుకకు రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావులు హాజరై వధూవరులను దీవించారు. వీరి వెంట నాయకులు గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకులపాటి శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లిపూడి సలీం, మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామమోహన్‌రెడ్డి, పోతుల అప్పిరెడ్డి, దుగ్గిరాల రమేష్‌బాబు మండల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి యున్న కోటసత్తెమ్మ తల్లి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,00,637 ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి సాయం అందజేత

కొవ్వూరు: నియోజకవర్గంలో ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న 11 మందికి సీఎం సహాయ నిధి నుంచి అందిన రూ.14,12,907 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటే శ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు వీటిని అందజేశారు. నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

కొవ్వూరు: పట్టణ శివారులోని ఏషియన్ గోదాము సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గుగ్గిలం వంశీకి తీవ్ర గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శివాలయంలో అన్న సమారాధన

చాగల్లు: స్థానిక వినాయకుడి ఆలయం పక్కన ఉన్న శివాలయం వద్ద శివరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి చాగల్లు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు: కాపవరం ఫ్లెటేవర్ బ్రిడ్జి దగ్గరలో ఈ నెల 5న ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి గాయాలపాలై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ ఎస్సై శ్రీహరిరావు తెలిపారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీఆర్వో కౌరు వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి భిక్షాటన చేస్తున్న వ్యక్తిగా గుర్తించామన్నారు.

ప్రజల మన్ననలు పొందిన డేవిడ్



పదవీ విరమణ చేసిన లైన్ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌ను అభినందిస్తున్న ఎస్ఈ తిలక్‌కుమార్

నల్లజర్ల: ఉద్యోగులు తమ విధులను అంకిత భావంతో నిర్వహిస్తే ఏ రంగంలో ఉన్నా ప్రజల మన్ననలు పొందుతారని ఆకోవకు చెందిన వ్యక్తే ఎల్.ఐ డేవిడ్ అని విద్యుత్‌శాఖ ఎస్.ఈ కె.తిలక్‌కుమార్ కొనియాడారు. నల్లజర్ల విద్యుత్ శాఖలో ఎల్.ఐగా పనిచేస్తూ గత నెలాఖరున పదవి విరమణ చేసిన ఈదా డేవిడ్‌కు సహనికులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఈ హాజరై డేవిడ్ సేవలను కొనియాడుతూ సర్వీసులో ఎటువంటి రిమార్కులు లేకుండా పనిచేయడం అభినందనీయమన్నారు. ఆయన శేష జీవితం కూడా ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డేవిడ్ దంపతలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఈఈ నారాయణం అప్పారావు, 1104 యూనియన్ రీజినల్ అధ్యక్షుడు సి.నరసింహరావు, సెక్రటరీ యం.రమేష్, నిడదవోలుడివిజన్ అధ్యక్షులు పీవీ సత్యనారాయణ, సెక్రటరీ జి.సత్యనారాయణ, ఏడీఏ శివప్రసాద్,ఏఈలు బాపిరాజు, వెంకటరమణ, ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మహేష్‌కు మరామర్శ

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు ఎంపీటీసీ-2 నూతలపాటి చంద్రమ్మ కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మహేష్‌ను ఆదివారం మాజీ హోం శాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గం సమన్వయకర్త తానేటి వనిత పరామర్శించారు. మహేష్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని మాజీ మంత్రి వనిత తెలుసుకుని ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, గ్రామ కమిటీ అధ్యక్షులు పాపోలు రెడ్డిబాబు, నిమ్మగడ్డ కృష్ణ, నాగరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువత పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



గోపాలపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

గోపాలపురం: విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే యువత పోరుబాట పోస్టర్‌ను ఆదివారం మాజీ హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత ఆవిష్కరించారు. స్థానిక కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద మాజీ మంత్రి వనిత మాట్లాడుతూ అమలు కాని హామీలు ఇచ్చి గద్దె నెక్కిన కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగానూ పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు కల్పన అంటూ అబద్ధపు హామీలు ఇచ్చిరాని దుయ్యబట్టారు. వారికి అండగా వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని కూటమి ప్రభుత్వం చేస్తున్న అచాచకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కే వల్లీ, చినబాబు, సాలి వేణు, కాకులపాటి శ్రీనివాస్, చాపల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలి



స్థానిక యువ క్రీడాకారులతో రాంబాబు

నిడదవోలు: నియోజకవర్గ కేంద్రం నిడదవోలు టౌన్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని, మినీ స్టేడియం నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని మినీ స్టేడియం సాధన పోరాట కమిటీ కన్వీనర్ జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక క్రీడాకారులతో రాంబాబు మాట్లాడుతూ ఒకప్పుడు జిల్లాలోనే నిడదవోలు ప్రాంతం క్రీడలకు ప్రసిద్ధి చెందిందన్నారు. అనేక క్రీడల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రస్తుతం ఇక్కడ క్రీడలకు తగిన ప్రోత్సాహం లేదన్నారు. దానికి కారణం క్రీడా మైదానం లేకపోవటమేనని రాంబాబు అన్నారు. చుట్టూ ఉన్న పట్టణాల్లో క్రీడా మైదానాలు ఉన్నాయని, ఇక్కడ క్రికెట్ స్టేడియం లేకపోవటం వల్ల క్రికెట్ క్రీడాకారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తే అన్ని రకాల క్రీడలు ఆడుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. క్రీడా మైదానం కోసం ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని రాంబాబు డిమాండ్ చేశారు.

పార్టీ శ్రేయస్సు కోసం ఐక్యతతో పయనిద్దాం

- మాజీ హోం మంత్రి తానేటి వనిత
- నల్లజర్లలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: పార్టీ శ్రేయస్సు దృష్ట్యా మనమంతా ఐక్యతతో పయనిద్దామని గోపాలపురం వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం నల్లజర్లలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం అధ్యక్షతన కార్యకర్తల, నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీకి కార్యకర్తలు, నాయకుల ఐక్యతే పునాది అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. ఏ ఒక్కరూ అధైర్య పడకుండా పార్టీ కోసం పనిచేయాలన్నారు. అక్కడక్కడ చిన్నపాటి విభేదాలు ఉన్నా వాటన్నింటినీ పక్కన పెట్టి పార్టీని బలోపేతం చేసేందుకు కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలచారన్నారు. ప్రతి కుటుంబానికి మేలు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే దాడులతో ప్రజలను భయాందోళనలకు గురి చేస్తుండటం దుర్మార్గమన్నారు. ప్రణాళికాబద్ధంగా పార్టీని బలోపేతం చేసి ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు.

12న పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఈ నెల 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించాలని వనిత కోరారు. అనంతరం విద్యార్థులు, యువకుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

14న పార్టీ సమావేశం

ఈ నెల14న నల్లజర్ల మండల కార్యకర్తలు, నాయకుల సమావేశం నల్లజర్లలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షులు వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి రాజా హాజరవుతారన్నారు. ఈ రెండు కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, నాయకులు తాడిగడప శ్రీనివాసరావు, నాగూ యాదవ్, నక్కా పండు, మేణ్ణి యువరాజు, ఎంపీటీసీలు పాపానాగేశ్వరావు, చిడిపి చింతయ్య, ఇమ్మణ్ణి సత్తిపండు, అల్లూరిసూర్యచంద్రరావు, శెనగన సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ బాలుర, బాలికల జట్లు ఎంపిక



బాలుర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు



బాలికల జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సబ్ జూనియర్స్ అండర్-16 బాలికల, బాలుర కబడ్డీ జట్లు ఎంపిక పూర్తయినట్టు అసోసియేషన్ సెక్రటరీ యలమరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. ఈ ఎంపికలు తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగాయన్నారు. వివిధ గ్రామాల నుంచి దాదాపు 200 మంది హాజరు కాగా అందులో 12 మంది బాలుర, 12 మంది బాలికల జట్టును ఎంపిక చేసినట్టు చెప్పారు. వీరంతా త్వరలో కడప జిల్లా పులివెందులలో జరిగే 34వ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని సెలక్షన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సంకు సూర్యనారాయణ వెల్లడించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కే.షణ్ముకుం, కె.వి.ఆర్.సుబ్బారావు, బి.ప్రదీప్, కె.మంగ,వి.సత్యవేణి, సి.రాణి పాల్గొన్నారు.

గుర్తుకొచ్చిన మధుర జ్ఞాపకాలు



తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల 1983-1984 బ్యాచ్ విద్యార్థులు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని పరస పద్మరాజారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1983-1984 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యార్థులంతా నాటి పాఠశాల రోజుల్లో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. నాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు ఆంజనేయులు, సుశీల, ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయరాలు కృష్ణవేణి తదితరులను ఘనంగా సత్కరించారు. పరస రాధాకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తైలం రామకృష్ణ, తారారామ్, జడ్డు శ్రీను, వడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాకేత్ గాత్రం



గాత్రకచేరి చేస్తున్న సాకేత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చెన్నయ్‌కు చెందిన సాకేత్ రామ్ గాత్ర కచేరి సంగీత ప్రియులను అలరించింది. శ్రీత్యాగరాజ నారాయణ దాస సేవాసమితి లో జరుగుతున్న 74వ సంగీత వార్షికోత్సవాలు లో భాగంగా ఆదివారం జరిగిన సాకేత్ గాత్రానికి విశాఖ పట్టణానికి చెందిన ఎంఎస్ఎన్ మూర్తికి వయోలిన్, వంకాయల వెంకట రమణ మూర్తి మృదంగం, గుంటూరుకు చెందిన కె.హరిబాబు ఘటం సహకారాలను అందించారు. ప్రముఖ న్యాయవాదులు మద్దూరి శివ.సుబ్బారావు, మద్దూరి శివరామ శశి భూషణ్‌లు ఈ కార్యక్రమానికి చేయూతనిచ్చారు. కార్యవర్గ సభ్యులు,పెద్ద సంఖ్యలో సంగీతాభిమానులు హాజరయ్యారు.

దివాన్‌చెరువులో వెల్‌బేబి కాంటెస్ట్

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సంకర ఫౌండేషన్ కార్యాలయం ఆధ్వర్యంలో వినయ్ విద్యా విహార్ స్కూల్‌లో ఆదివారం ఆరేళ్లలోపు బాలబాలికలకు వెల్ బేబి పోటీలు జరిగాయి. 80 మంది బాలలు ఈ పోటీలలో పాల్గొనగా, ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నూకరత్నం, డాక్టర్ శ్రీజ, డాక్టర్ హేమానలిని, ప్రాణిక్ హీలింగ్‌రాజ్యలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే కిర్లంపూడి మండలం, బూరుగుపూడిలో నిర్వహించిన మగ్గం వర్కు ఉచిత శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

నరసన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

మధురపూడి: చారిత్రక నేపథ్యంతోపాటు, పవిత్రతకు నిలయమైన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. వేదపండితులు, భక్తులు పుట్టమన్ను సేరించడంతో ఈ ఉత్సవాలను మొదలుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అయితే ఈ ఉత్సవాలకు సరైన ఏర్పాట్లు చేయలేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక దేవస్థానం రోడ్డు ప్రారంభంలో ఉన్న స్వామివారి ఆర్చికు రంగులు వేయలేదు. స్థానిక బస్టాండ్‌లో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల సదుపాయాన్ని కల్పించలేదు. సోమవారం రథోత్సవం జరగాల్సి ఉండగా, రథం రోడ్డును నీటితో తడపలేదు. ఉత్సవాలు సందర్భంగా అన్నవరం దేవస్థానం అధికారులు ప్రచురించిన కరపత్రంలో తప్పులు దొర్లాయి. ఈనెల 15వ తేదీన కొండపైన దేవాల యంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ దైవ దర్శనాలు ఉండవని, ఏక కాలార్చన మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. కానీ ఉత్సవాల సందర్భంలో త్రికాలర్చన జరుగుతోందన్న విషయాన్ని మరిచారు. అలాగే మండలంలోని ప్రముఖులు, స్వామివారి దేవస్థానానికి చందాలిచ్చిన దాతలు, ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు ఇవ్వలేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. రథోత్సవం సందర్భంలో ప్రమాదాలు జరగడానికి కారణమైన సమస్యను అపరిష్కృతంగానే ఉంది.